రాయబారి

వారానికి ఒక్కసారైనా యింటికి వచ్చి పిల్లల యోగక్షేమాలు చూసే సత్యనారాయణ నెలరోజులు గడిచినా యింటికి రాలేదు. జానకమ్మకు ఆదుర్దా కలగలేదు కాని చాలా బాధపడింది. చిన్న విషయంపై మాటపట్టింపులు పెట్టుకుని కోపంతో భర్త యింటికి రావడం మానేశాడని ఆమెకు తెలుసు.

ఎంతో అభిమానంతో నిత్యమూ పరిహాసాలాడే సత్యనారాయణ కోపం తెచ్చుకొని యింటికి రాకపోవడంవల్ల యిల్లంతా చిన్నబోయింది. పిల్లలు తండ్రిగురించి అస్తమానూ అడగసాగారు ఐదేండ్ల ఆఖరిపిల్ల విమలకు మూడురోజులనుంచి తీవ్రంగా జ్వరం కాస్తూంది. తండ్రి గురించి కలవరిస్తోంది.

అక్కడికి నాల్గు ఉత్తరాలుకూడా రాసింది జానకమ్మ, యింటికి రావలసింది పిల్లలు బెంగ పెట్టుకున్నారని కాని సత్యనారాయణకు జానకమ్మమీద కోపం తగ్గక యింటికి రాలేదు. ఆమె కాపురానికి వచ్చాక గడిచిన పది సంవత్సరాలతోనూ సత్యనారాయణకు యింత కోపం రావడం జానకమ్మ ఎప్పుడూ చూడలేదు. ఆ కోపం యిక ముందుకూడా యిలాగే ఉండి పోతుందేమో అని భయపడి దుఃఖం ఆగక ఏడ్చింది.

అప్పుడే ఆటలు ఆడుకుని యింటికి వచ్చిన కృష్ణుడు, తల్లి ఏడుస్తూ కొంగుతో కన్నీరు తుడుచుకోడం చూశాడు ఆమె కన్నీరు అతనిలో ప్రేమ సుప్తాంగ చేసింది.

"అమ్మా! ఎందుకే ఏడుస్తున్నావు!" అంటూ కృష్ణుడు తల్లి ఒడిలో కూర్చుని అనునయించాడు.

తొమ్మిదేండ్ల కుర్రవాడు కృష్ణుడు తన దగ్గరకువచ్చి అనునయిస్తూంటే, ఎందుకో ఆమెకు దుఃఖం పొంగిపొరలింది. వెక్కి వెక్కి ఏడ్చింది. దుఃఖం దిగమింగుకుని మొండిగా సంచరించేవాళ్ళని ఎవరైనా ఓదారిస్తే సముద్రపు కెరటంలా ఒక్కసారి ఉబికి వస్తుంది. దుఃఖం.

జ్వరంతో మంచం మీద పడుకున్న విమల "అమ్మా! నాన్న ఎప్పుడు వస్తారే! మంచిబొమ్మలు తెస్తానన్నారే నాకు" అంటూ తల్లినడిగింది.

కృష్ణుడికి తండ్రి జ్ఞాపకం వచ్చాడు. "అమ్మా! నాన్న నెల్లాళ్ళ నుంచి ఎందుకు రావటం లేదే యింటికి" అని అమాయకంగా ప్రశ్నించాడు.

ఏదో కారణం కొడుక్కి చెప్పవలసిన బాధ్యత జానకమ్మ మీద పడింది. అసలు సంగతి చెప్పదలచక పోయినా, దానికి సంబంధించిన మాటలు మాత్రం అప్రయత్నంగా ఆమె నోట వచ్చేశాయి సమాధానంగా.

"మీ నాన్నకు నామీద కోపం వచ్చిందిరా."

"ఎందుకే?"

ఈ మాటకు ఏం సమాధానం యివ్వాలో జానకమ్మకు తెలియ లేదు. అపుకుందా మన్నా దుఃఖం ఆగక బలవంతాన పైకి వెల్లుబికింది. తల్లి ఏడుపుచూసి కృష్ణుని కడుపు తరుక్కు పోయింది.

"ఎందుకే అమ్మా అలా ఏడుస్తావు? నేను వెళ్ళి నాన్న గారిని తీసుకువస్తానే."

కొడుకు మాటలు విని ఒక్క సారి జానకమ్మ అతని ముఖంలోకి చూసింది. ఆమెకు మెదడులో ఏదో గబుక్కున ఆలోచన తట్టింది. కాని ఆమెకు భయం వేసింది. కొడుకు ఒక్కడూ ప్రయాణం చేసి తండ్రి దగ్గరకు వెళ్ళగలడా?

ఆయన కొద్ది రోజులు ఓపిక పడితే సత్యనారాయణ తిరిగి రావచ్చనే ఆశతో, ఆ విషయం ప్రక్కకు నెట్టింది ఆమె.

మరో పదిహేనురోజులు గడచినా సత్యనారాయణ యింటికి రాలేదు. అతను యిల్లు విడిచి వెళ్ళినప్పుడు యిచ్చిన అరవై రూపాయలు ఖర్చయిపోయి అప్పుడే రెండు వారాలు గడిచాయి. పైగా అప్పులు పెరిగిపోయాయి ఆ వూరిలో.

సత్యనారాయణ పుట్టిపెరిగిన ఊరు అవడంవల్ల, ఆయనకున్న పరపతి యింతకాలం జానకమ్మ ఉపయోగించుకుని కృష్ణుడి చేత యింట్లోకి కావలసిన దినవెచ్చాలు అప్పుచేసి తెచ్చుకుంటోంది. పాలు, చాకలి, పెరుగు వాళ్ళు మామూలుగా వతనుగా పోస్తున్నా, నెలాఖరున డబ్బు ముట్టకపోవడంవల్ల రోజూ యింటికి వచ్చి అడిగి,కసురుకుని మరీ వెళ్ళిపోతున్నారు. బియ్యం యిచ్చే వీరన్న నాల్గోసారిరావడమైంది. "ఏమండీ! డబ్బు యివ్వరా? బాబుగారు ఎప్పుడువస్తారు!" అని సణిగాడు దిన దిన గండంగా బ్రతికే యింట్లో దాసీది నెలాఖరున రావలసిన నాల్గురూపాయలు ముట్టక పోయేటప్పటికి కటకటలాడి పోతుంది. జానకమ్మను బెదిరించింది కూడా,పని మానేస్తానని. కోమటి సత్తెయ్య పద్దుబుక్కు పుచ్చుకుని పదిసార్లు ప్రత్యక్షమయ్యాడు.

పొరుగింటి రహస్యాలు ఛేదించి తెలుసుకుంటే గాని ఊబుసుపోని అమ్మలక్కలు, సత్యనారాయణ నెలా పదిహేను రోజులు యింటికి రాక పోవడంవల్ల సంగతి ఏమిటని గుసగుస లాడుకున్నారు. కారణం ఏమీ కనిపించక, జానకమ్మను వది లేసి ఉంటాడనీ, ఏ ముండలతో లేచిపోయా డనీ నోటికి వచ్చినరీతిగా అపవాదులు ప్రచారం చేశారు.

ఇవన్నీ జానకమ్మ చెవినిబడ్డాయి. ఆ మాటలు విని సహించలేక కుళ్ళి కుమిలి ఏడ్చింది. యింక ఏలాగైనా కృష్ణుడిని తండ్రిదగ్గరకు పంపి యింటికి రప్పించాలనుకుంది. దారి ఖర్చులకు ఏమిస్తుంది? చేతిలో ఒక్క పావలామాత్రం వుంది. ప్రక్కయింటివారిని అప్పు అడుగుదా మంటే, తన భర్త విషయము మొట్టమొదట ప్రశ్నిస్తారు. ఆమెకు తల తీసినట్లవుతుంది. జానకమ్మకు ఏమీతోచక దిగులుగా ఒకమూల కూర్చుని ఏడుస్తోంది.

కృష్ణుడు తల్లి దిగాలు ముఖం, దుఃఖం చూసి ఆమె దగ్గరకు వచ్చాడు.

"ఎందుకే అలా వున్నావు అమ్మా! నేను వెళ్ళి నాన్న గారిని తీసుకు వస్తాను. డబ్బు యివ్వవే" అన్నాడు.

ఉబికివచ్చే దుఃఖాన్ని దిగమింగుకుంది జానకమ్మ.

"అయితే వెడతావా కృష్ణా?"

"వెడతానమ్మా."

"ఎలాగ వెళ్ళాలో తెలుసా!"

"బజారులో బస్సుందికదే! అది ఎక్కితే వెళ్ళిపోతాను."

ఇప్పటివరకు ఎన్నడూ కృష్ణుడు ఒంటరిగా ప్రయాణంచేసి ఎరగడు, అందులో ముప్పదిమైళ్ళ దూరంలో ఉన్న కోటిఫలి ఎలా వెళ్ళాలో ఏం తెలుస్తుందో! బజారులో బస్సుస్టాండు దగ్గర "కోటిఫలి" అని వ్రాసివున్న బస్సుచూసి, అది ఎక్కితే కోటిఫలి వెళ్ళిపోవచ్చని అతని ఉద్దేశ్యం. పైగా తండ్రి కోటిఫలి వెడుతూ ఆ బస్సు ఎక్కడం రెండు సార్లు చూశాడు కృష్ణుడు.

కొడుకు ఊహ గ్రహించి జానకమ్మ నవ్వింది. అతని ఊహాలలోతు కనుక్కుందామని మళ్ళీ ప్రశ్నించింది జానకమ్మ.

"మరి కోటిఫలి బస్సుఎక్కి వెడతావనుకో! తర్వాత నాన్నగారు ఎక్కడ ఉన్నారో ఎలా కనుక్కుంటావురా."

"ఏముందీ! యిన్స్పెక్టరు సత్యనారాయణగారు ఎక్కడున్నారని అడిగితే, ఎవరైనా చెబుతారమ్మా! నోట్లో నాలిక ఉంటే అన్నీ చేయవచ్చు"

కృష్ణుడి మాటల అమాయకత్వంలోని ధైర్యం జానకమ్మకు సేద కూర్చింది. కాని చేతిలో ఒక్క పావలామాత్రం ఉంది. బస్సుకైతే రూపాయిన్నర కావాలి పడవకైతే మూడణాలతో వెళ్ళవచ్చు. ప్రక్క యింటి అమ్మ లక్కలను అప్పు అడగడం యిష్టంలేక, కొడుకు చేతిలో పావలా పెట్టింది జానకమ్మ.

"సాయంత్రం ఆరుగంటలకు కాలవ ఒడ్డుకు కోటీఫలి వెళ్ళే పడవ వస్తుంది. అది ఎక్కితే తెల్లవారేసరికి కోటిఫలి వెళ్ళవచ్చు. నాన్నగారిని కలుసుకొని యింటికి నేను రమ్మన్నానని చెప్పు." అంది జానకమ్మ కృష్ణుడిని ఒంటరిగా ప్రయాణం చేయిస్తున్నాననే దిగులుతో అది తప్ప, మరోమార్గం కనిపించలేదు ఆమెకు

"నీకంత బెంగ ఎందుకే, నేను వెళ్ళివస్తాగా" కృష్ణుడిచ్చే అమాయక వాగ్దానం నవ్వుతూ అందుకుంది.

కంచంలో పెట్టిన అన్నం తిన్నాడు కృష్ణుడు, యింటిలో ఉన్న పాతనంచీలో రెండు లాగులు రెండుచొక్కాలువేసి కృష్ణుడి చేతికిచ్చింది జానకమ్మ.

నంచీ అందుకుని 'అవెళ్ళివస్తానే అమ్మా' అన్నాడు కృష్ణుడు.

"ఎక్కడికి అన్నయ్యా" అంది విమల వీధిలోంచి వస్తూ పిల్ల 'ఎక్కడికి అని వేసినప్రశ్న కృష్ణుడి ప్రయాణానికి అపశకునమేమో అని భయపడింది జానకమ్మ. కాని అమాయకపు చిన్ని ఆడపిల్ల నవ్వుతూ ఎదురుగా రావడం మంచిశకునం కావచ్చని తర్వాత ధైర్యం తెచ్చుకుంది ఆవిడ.

"నాన్న దగ్గరికి" అన్నాడు కృష్ణుడు చెల్లెలితో.

"అమ్మా! నేనూ వెడతానే" అంటూ మారాము చేసింది విమల.

"తప్పు! అన్నయ్యా వెళ్ళి నాన్నను తీసుక వస్తాడు. అందాక మనం యిద్దరం ఇక్కడేవుందాం. మంచికథలు చెబుతాను." అంది జానకమ్మ.

'నువ్వు ఎప్పుడూ యింతే. ఎక్కడికీ పంపవు.' అంటూ మూతి ముడుచుకుని యింట్లోకి పోయింది విమల.

కృష్ణుడు నవ్వుతూ నుంచున్నాడు, తల్లి అనుజ్ఞకోసం,

'మరి నాన్నగారు కనిపించకపోతే, మళ్ళ యింటికి ఎలా రాగలవురా' అంటూ దిగులుగా మళ్ళీ అడిగింది జానకమ్మ, తాను యిచ్చిన పావలా ఒక్కవడవ ఖర్చుకు సరిపోతుంది.

'నువ్వేం భయపడకమ్మా! నేను వెళ్ళి ఎలాగో లాగ నాన్నగారిని తీసుకువస్తాగా.' అంటూ నవ్వుతూ గబగబ వీధిలోనికి అడుగులు వేశాడు. కృష్ణుడు కంటికి కనిపించేదాక జానకమ్మ కొడుకుకేసిచూస్తూ గుమ్మంలో నిలబడి పోయింది.

తల్లియిచ్చిన బట్టలసంచీ బుజాన తగిలించుకుని, కాలవరోడ్డు పట్టాడు కృష్ణుడు. అప్పుడప్పుడు కాలవకు నాన్నతో అమ్మతో స్నానాలకు వెళ్ళేవాడు. అందుచేత ఆ రోడ్డు పూర్తిగా జ్ఞాపకం.

మైలుదూరం నడిచి, కాలవస్నానాల రేవు దగ్గర చేరాడు కృష్ణుడు. అప్పుడే సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఫర్లాంగు దూరంలో ప్రయాణీకులను కాలవ రెండవగట్టుకు చేరుస్తున్నా డొకడు దోనెలో. కాలవ రెండు వైపులాఉన్న ఈతచెట్లు రివ్వున వీచేగాలికి తలలాడిస్తున్నాయి.

ఎవరో ఒక అపరిచితుడు, ముసలాయన చుట్ట కాల్చుకుంటూ, ఆ దారిని పోతూంటే కృష్ణుడు పలకరించాడు.

'ఏమండి! కోటిఫలికి వెళ్ళే పడవలు యిక్కడికే వస్తాయాండి?'

'ఆఁ'

'ఎన్ని గంటలకు వస్తాయో మీకు తెలుసా.'

'ఒక అరగంటలో రావచ్చు'

అంటూ నోట్లోంచి ఆయన చుట్ట తీసి, తుపుక్కున ఉమ్మేసి, తిరిగి నోట్లో చుట్టపెట్టుకుంటూ పరకాయించి చూశాడు కృష్ణుణ్ణి.

'ఎవరబ్బాయివి బాబూ'

'సత్యనారాయణగారి అబ్బాయిని.'

'అలాగా!...అయితే మీ నాన్నగారిప్పుడు ఎక్కడుంటున్నారు.'

'కోటిఫలిలో ఉంటున్నారు' అన్నాడు ధీమాగా కృష్ణుడు. ఆ ముసలాయన మాటల్లోని అంతరార్థం తెలియకపోయినా.

'హిహిహి: అలాగా' అనుకుంటూ ఆ ముసలాయన వెళ్ళిపోయాడు.

కృష్ణుడు అదే పడవల రేవని నిశ్చయించు కున్నాడు. మరోక్షణం ప్రక్కకి చూడగానే ఆమడదూరంలో ఒక పడవ కనిపించింది. ముగ్గురు మనుష్యులు త్రాడుపడవకుకట్టి గట్టుమీద నడుస్తూలాగడం చూశాడు. నిండు కాలవ నీటిలో తెరచాప విప్పుకొని అందంగా మందయానం చేస్తూన్న ఆ పడవ ఒయ్యారా లొలికిస్తూ రెక్కలు విప్పుకు నడిచే హంసలా ఉంది. పడవ రేవు చేరింది. గట్టుమీదనుంచి పడవ లాగేవాళ్ళు తాడు చుట్టిదానిలో పల విసిరేరు.

లావుగా బొద్దుగా, నల్లగా గిరజాలు వేసుకొని చెవులకు వెండి కమ్మలు తగిలించుకుని పడవ తెడ్డుతో బయటనుంచున్న మనిషి కృష్ణుడిని పలకరించాడు.

'ఏవూ రెడతావయ్యా!'

'కోటిఫలి!'

'ఎక్క ఎక్క' అంటూ పళుక్కుమని కర్ర విరిచినట్లు అని ఊరు కున్నాడు. ఆ పడవ ఆసామీ.

'టిక్కెట్టెంత?'

మూడు అణాలు.'

'ఎంతసేపట్లో బయలుదేరుతుంది.

'అదేపోతుంది ఎక్కవయ్యా' అంటూ కసిరాడు ఆ పడవపెద్ద.

కృష్ణుడు పడవ ఎక్కాడు. నిమ్మకాయలు నిలవకలిగే ఆ పడవ ఆసామీ పెద్ద మీసాలు, చింతనిప్పుల్లాంటి ఎర్రటి కళ్ళుచూసి, వీళ్ళు దొంగ లేమో అని లోపల భయపడ్డాడు కృష్ణుడు. పడవలోపలికి వెళ్ళగానే ఒక ముప్పయి ఏండ్ల వితంతువు, ఒక ఏదేళ్ళకుర్రాడు. శాలువా కప్పుకుని శ్రోత్రియంగా కనపడుతున్న ఒక మధ్య వయస్కుశాస్త్రుల్లుగారు కనిపించారు.

'పిన్నిగారూ యీ పడవ కోటిఫలి వెడుతుంది కదండి' అని వరుస కలిపి, చనువుచేసుకుంటూ ఆ వితంతువును పలకరించాడు కృష్ణుడు.

'వెడుతుంది బాబూ'

కృష్ణుడి మనస్సు స్థిమితపడింది.

'ఆ అబ్బాయి మీ కొడుకాండి'

'కరిచేస్తా నీకెందుకు నా గొడవ' అంటూ ఆ కుర్రాడు గాండ్రించి కృష్ణుడి వైపు చురచురా చూశాడు.

యీ లోపుగా వితంతువు అడ్డుకుంది. 'వాడికి మతిలేదు నాయనా ఏమీ పలకరించకు.' అది వినగానే ఆ కుర్రాడు చర్రున లేచి 'నాకు మతి లేదూ' అంటూ ఆ వితంతువును కొట్టబోయాడు. ఎదురుగా ఉన్న శాస్త్రి గారు ఆ కుర్రాడిని పట్టుకుని బెదిరించి మూల కూర్చోబెట్టారు. ఒక నిట్టూర్పు విడిచి 'కర్మ' అంటూ చేతిలో రుద్రాక్షమాల త్రిప్పడం మొదలు పెట్టారు ఏదో జపిస్తూ.

కృష్ణుడు యింక వాళ్ళతో మాట్లాడలేదు. పడవ కదిలింది. పడవ నడుస్తూన్నంతసేపు ఆతనికి భయమే; మధ్యలో యీ పిచ్చికుర్రాడు లేచి పీక నొక్కుతాడేమోనని. నల్లగా దొంగల్లా కనిపించే పడవవాళ్ళు తన సంచీ దొంగిలిస్తారేమో అని ఒళ్ళో దాన్ని గట్టిగా పట్టుకుని ముడుచుకు కూర్చున్నాడు.

పడవ నడుస్తోంది. చుట్టు నిశీధం. పడవముందు కట్టిన హరికేన్ లాంతరు వెల్గులు మాత్రం కాలవనీటిలో పడి, బంగారురంగుతో పడవ రహదారి నీటిమీద మలిచినట్లయింది.

తన జీవితంలో మొట్టమొదటి ప్రయాణం అది కృష్ణుడికి. పడవ కున్న అద్దాల కిటికీద్వారా బయటకి చూశాడు. ఆ నిశీధంలో చెట్లు గుబురు గుబురుగా కనిపించాయి. ఆకాశంలో చుక్కలు మిల మిలా

మెరుస్తున్నాయి చూస్తున్న కొలదీ, తను చూడవలసిన విశాలప్రపంచం యింకా ఎంతో వుందనిపించింది.

ఒక లాకు వద్ద పడవ ఆగింది. లాకు తలుపులు తెరుచుకున్నాయి. లాకులో పాతాళంలో ఉన్నట్లుంది. పడవ, పడవ ఆసాములు చుట్టపొగ గుప్పు గుప్పున వదులుతున్నారు. పాతాళంలో ఉన్నా పడవ క్రమక్రమంగా పైకి తేలడం మొదలెట్టింది. అది ఎంతో చిత్రంగా ఉంది కృష్ణుడికి. లాకులోంచి బయటికి వచ్చాక ఆ పడవని ఆరాత్రికి అక్కడ కట్టేశాడు; దారిలో ముందు దోపిడి దొంగల గొడవ ఎక్కువగా ఉందని.

రాత్రి లాకులవద్ద ఆగిపోవడంవల్ల, తెల్లవారగానే కోటిఫలి చేరవలసిన పడవ, మధ్యాహ్నం పదకొండు గంటలకు చేరింది.

కృష్ణుడు పడవదిగి ఊళ్ళోకి నడిచాడు. ఎండ మిటమిటలాడుతూంది. దారిలో రైతు ఒకడు కర్రపుచ్చుకుని పోతూంటే "ఇనస్పెక్టరు సత్యనారాయణ గారెక్కడుంటారో తెలుసా" అని అడిగాడు. "ఏ ఇనస్పెక్టరయ్యా" అంటూ సాగిపోయాడు రైతు.

కృష్ణుడికి ఒక ఆలోచన తట్టింది. తండ్రి ఆఫీసు కనుక్కుంటే యింటికి ఎవరో ఒకరు అక్కడినుంచి దారి చూపిస్తారని ఆశ కలిగింది. రెండడుగులు వేయగానే పోస్టు బంట్రోతు ఎదురయ్యాడు. అతన్ని అడిగాడు ఇనస్పెక్టరుగారి ఆఫీసు ఎక్కడని.

"ఏ ఇనస్పెక్టరు, పోలీసా? రెవిన్యూ? కోపరేటివ్? ఎవరు?"

"సత్యనారాయణగారు"

పోస్టు బంట్రోతుకు అర్థమైంది. ఆఫీసుకు దారి చూపించాడు.

ఆఫీసు గుమ్మంలో చేరగానే, ఎదురు గదిలో, ముగ్గురు గుమాస్తాలు, కాగితాలు బరబరా, చెమట్లు కార్చుకుంటూ గీసేస్తున్నారు. వాళ్ళని అడిగాడు కృష్ణుడు "సత్యనారాయణగారున్నారా" అని.

"ఎందుకు" అన్నాడొక ముసలిగుమాస్తా. కళ్ళజోడు జాగ్రత్తగా పైకి ఎత్తిచూస్తూ.

'మా నాన్నగారు ఆయన' అన్నాడు కృష్ణుడు. ఆ ముసలిగుమాస్తా ఒక్క గెంతువేసి లేచాడు.

"రండి రండి అబ్బాయిగారూ లోపలికి రండి." అంటూ ఆఫీసు గదిలోనుంచి వరండాలోకి తీసుకు వెళ్ళాడు. అడుగులకు మడుగులొత్తుతూ ముందు నడిచే ఆ ముసలి గుమాస్తా వైనంచూస్తే, తనకు రాచమర్యాదలు జరుపుతున్నట్లనిపించింది. కృష్ణుడు పొంగిపోయాడు. తన తండ్రి చాలా గొప్ప ఉద్యోగి అని. వెనకవున్న గుమాస్తాలు 'ఇనస్పెక్టరుగారి అబ్బాయిట' అంటూ నోరు ఆవలించారు.

ఆఫీసుగది దాటి లోపల వరండాలో కాలుపెడుతూ 'మీ అబ్బాయి గారొచ్చారండి' అన్నాడు ఆ ముసలి గుమాస్తా.

"రమ్మను లోపలికి" అన్నాడు సత్యనారాయణ విసుగ్గా. గుమాస్తా అన్న ముక్కలు పూర్తిగా వినిపించుకోకుండానే.

వరండాలో అడుగుపెట్టగానే పదిమంది జనం గుండ్రంగా కూర్చుని, ఎదురుగా రూపాయలు ఖంగుమనిపిస్తూ, ఎర్రటి చింత నిప్పుల్లాంటి కళ్ళతో తీవ్రంగా ఒకరి నొకరు చూసుకుంటూ పేకముక్కలు సర్దుకుంటున్నారు. అసలు కృష్ణుడిని చూసే తీరిక లేనట్టున్నారు ఆ జనం.

'నాన్నా' నాన్నా 'అన్నాడు కృష్ణుడు భయంతో.

సత్యనారాయణ తల పైకెత్తిచూశాడు. మోకాలుదాకా చిన్న నల్లని నిక్కరు తొడుక్కుని, మాసిపోయిన తెల్లని చొక్కాతో, బుజానికి సంచీ తగిలించుకుని, చెల్లాచెదిరి యెగిరే ముంగురులతో, చెప్పులు లేని పాదాలతో, ఎండదెబ్బకు నీరసిల్లిన గొంతుకతో యెదురుగా నిలుచున్న కృష్ణుణ్ణి

చూసి ఆశ్చర్యపోయాడు సత్యనారాయణ. ముప్పైమైళ్ళ దూరంనుంచి యిలా వచ్చాడో, ఎందుకు వచ్చాడో, అర్థం కాలేదు ఆయనకు.

'ఏరా! యిదేనా రావడం! యింటిదగ్గర అంతా కులాసాగా వున్నారా' అన్నాడు సత్యనారాయణ కంగారుగా.

'అంతా బాగున్నారు నాన్నా' అంటూ సంచీ బుజాన్నించి తీసి, గబగబా వెళ్ళి తండ్రి ప్రక్కన కూర్చున్నాడు కృష్ణుడు. నెలా పదిహేను రోజుల తర్వాత కొడుకును చూసిన సత్యనారాయణకు పుత్రవాత్సల్యం ఉప్పొంగింది. ఐదు నిమిషాలలో పేకాట ముగించి లేచారు. ప్రక్కనున్న స్నేహిత బృందం 'యితను మీ అబ్బాయి ఏమిటోయ్? ఏం చదువు తున్నావు? అబ్బో! ఇంతదూరం ఒంటరిగా ప్రయాణంచేసి వచ్చావన్న మాట' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. 'మరి మావాడంటే ఏమను కున్నారు' అంటూ సత్యనారాయణ కొడుకు చదువు, తెలివి తేటలు గురించి గర్వంగా సమాధానం యిచ్చేడు. కృష్ణుడు ఠీవిగా నవ్వేడు, తను గొప్ప వాడన్నట్లు అందరూ పొగడుతూంటే.

ఇంటికి తీసుకువెళ్ళేడు తండ్రి. చేతివేళ్ళు పట్టుకుని నడుస్తూ, 'నాన్నా యిది మీ అఫీసా' అని అడిగాడు కృష్ణుడు.

'అవును.'

'మరి! ఆఫీసులో పేకాడుతారా?'

'ఏడిశావు! ఆ గొడవ నీకెందుకు?'

'అది కాదు నాన్నా అందరూ మరి కాగితాలు వ్రాస్తారుకదూ!'

'అవును మనకు ముగ్గురు గుమాస్తాలున్నారుకదూ, అంతపనీ వాళ్ళే చేసేస్తారు.'

కృష్ణుడు ఇంక మాట్లాడ లేదు ఆ విషయం గురించి. ఇంటికి వెళ్లాక స్నానంచేసి దుస్తులు మార్చుకున్నాడు. కృష్ణుడు ఎందుకు వచ్చాడో తెలుసుకునే ఆలోచనలో నిమగ్నుడైన సత్యనారాయణ తేరుకున్నాడు. కృష్ణుడు దుస్తులు మార్చుకురాగానే యిద్దరు హొటలువైపు నడిచారు.

తాటాకులతో కట్టిన ఆ హొటలు ముందు భాగం అందంగా మేజా బల్లలతో నిండివుంది. లోపల గదిలో మేజా బల్లమీద భోజనాలు వడ్డించారు. వడ్డించే మనిషి 'మీ అబ్బాయిగారాండి' అంటూ కృష్ణుడివైపు చూశాడు. అవునన్నట్లు నవ్వాడు సత్యనారాయణ. 'అలాగాండి' అంటూ అతను యింకా రెండుసార్లు అన్ని వంటకాలు ఎక్కువచేస్తూ అతి మర్యాదగా భోజనం పెట్టాడు.

'అమ్మ నిన్ను రెందుకు పంపిందిరా' అన్నాడు సత్యనారాయణ భోజనాలయినాక, యింటికి వస్తూంటే.

'నీకోసం బెంగపెట్టుకుంది నాన్నా. అస్తమానూ ఒక మూల కూర్చుని యేడుస్తూంది.

కృష్ణుడి మాటలు వినేటప్పటికి కోపంతో కఠినమయిన అతని హృదయం కరిగింది.

'పైగా యింట్లో డబ్బులేదు. బియ్యం వీరన్న, పాలసూరమ్మ, చాసీది, కొట్టువాడు, అస్తమానూ బాకీలు యిమ్మని పీక్కుతింటున్నారు నాన్నా. యిన్నాళ్ళు నువ్వు యింటికి వస్తావేమో అని చూసింది. నువ్వు రాలేదు అందుచేత చేతిలో మిగిలిన పావలా యిచ్చి నన్ను యిలా పడవమీద పంపించింది.

'పాపం! ఏం యిబ్బంది పడ్డారో యిన్నాళ్ళ' అనుకున్నాడు సత్యనారాయణ. ఇంతకీ ఒక చిన్న విషయంపై తాను అన్యాయంగా జానకమ్మను బాధపెట్టానని నొచ్చుకున్నాడు......

ఆరోజు, ఆఫీసు పనిమీద తిరిగి తిరిగి రాత్రి యింటికివచ్చాడు సత్యనారాయణ, గుమ్మంలో నుంచుని ఎప్పుడూ నవ్వుతూ ఆహ్వానించే జానకమ్మ ఆవేళ మూతిముడుచుకుని కూర్చుంది. విస్తట్లో అన్నం పెట్టి అడిగింది.

'రెండెకరాల భూమి అమ్మేశారుట కదూ!'

'ఎవరు చెప్పారు!'

'ఎవరో చెప్పడమేమిటి ఊరంతా అనుకుంటూంటే.'

'ఈ ఆడముండలకు మరోపని లేదు.'

'అబద్దాలాడ్డ మెందుకని?'

'ఎవరని?'

'మీరే...పిల్లలు రొుదుగుతున్నారు. బోలెడు ఖర్చు ముందువుంది. ఇలా భూములు అమ్ముకుంటూంటే సంసారం బాగుపడినట్లే'

'చాల్లే నువ్వు నాకేమీ సలహా లివ్వనక్కర్లేదు.'

'ఇల్లాగే అంటూండండి, చివరికి ఆస్తి అంతా తగులడ్డాక పిల్లలు ముష్టి రొత్తుకునేదాకా తెలిసిరాదు.'

'చాల్లే! నోరుముయ్యి.'

'ఆ పేకాట మానకూడదూ, మీకో దండం పెడతాను' రుస రుసలా డింది జానకమ్మ.

సత్యనారాయణ కోపం ఆగలేదు. వెండి కంచంలోని అన్నం గిర వాటేసి, ఛెళ్ళున జానకమ్మ దవడమీద కొట్టాడు. జానకమ్మ గుడ్లనీళ్ళు కుక్కుకుంటూ ఏడ్చింది. జేబులో వున్న రూపాయినోట్లు ఆమెమీద విసిరేసి, తక్షణం వంచి, కోటు తొడుక్కుని సైకిలు తీసుకుని, అర్థరాత్రి కోటిఫలి వచ్చేశాడు.

జరిగిన సంగతి కంటి ముందు తిరిగింది. తప్పెవరిది? సత్యనారాయణ ప్రశ్నించుకుని పశ్చాత్తాప పడ్డాడు. భూమి అమ్మినమాట వాస్తవమే. డబ్బు అరువుపెట్టి పేకాట ఆడాడు. ప్రతిసారి వోడిపోయాడు. మూడు వేలు బాకీపడ్డాడు. ఒకరోజు పేకాట ఆడుతూంటే స్నేహితులందరూ నానామాటలు అన్నారు. 'ఎంతకాలం యిలా అరువుమీద పేకాడతావు. ఆ డబ్బు రేపివ్వకపోతే మాట దక్కద'ని సత్యనారాయణకు వుక్రోషం, వుడుకుమోతుతనం వచ్చి, భూమి అమ్మేసి, బాకీలు తీర్చగా, మిగిలిన డబ్బు ఆరోజు రాత్రి జానకమ్మపై విసిరేశాడు.

తను భూమి అమ్మిన సంగతి జానకమ్మకు తెలియకూడదను కున్నాడు. తెలిసినందుకు చాలాకోపం వచ్చింది. ఆమె రెట్టించి అడుగుతూంటే ఒళ్ళుమండింది. అందుచేత ఆమె చెంప ఛెడేలుమంది.

కొడుకు చదువుకోసం, ఉన్నవూరని, సంసారం అక్కడ వుంచేసి తను కోటిఫలిలో హొటల్లో తింటూ కాలం గడుపుతున్నాడు సత్యనారాయణ. జానకమ్మ వ్రాసిన ఉత్తరాలు కోపంకొద్దీ చదవనైనా లేదు. మళ్ళీ పేకాట ధోరణిలోపడి యింటి సంగతి తలపెట్టలేదు.

'నాన్నా! యింటికి రమ్మంది అమ్మ నిన్ను. చెల్లాయికి యీ మధ్య చాలా జ్వరం వచ్చింది, నీకోసం రోజూ పలవరిస్తోంది.'

కృష్ణుడి అమాయక ప్రాధేయత చూసి, ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి. ఏడుస్తున్న జానకమ్మ యెదురుగా కనిపించినట్లయింది. తన పదేండ్ల సంసారంలో భార్యపై చేయిచేసుకోవడం అదే ప్రథమం, పాపం! ఎంత బాధపడిందో, అనుకున్నాడు.

'బాబయ్యా! ఒక్క కాసీ యిప్పించరూ. ఆకలి వేస్తోంది' అంటూ పదేళ్ళ కుర్రవాడు చిరిగిన లాగు చొక్కాతో నీరసంగా శవంలా నుంచున్నాడు వీధిలో. సత్యనారాయణ హృదయం కరిగి వాడిచేతిలో అణా వేశాడు.

'నాన్నా! ఆ కుర్రాడు అచ్చు నాలాగే వున్నాడు' అన్నాడు కృష్ణుడు.

సత్యనారాయణ మనస్సు చివుక్కుమంది. నిజం. ఆస్తివున్నా, తన పేకాట గొడవలలో సంసారం సంగతే మరిచిపోయేవాడుతను. పిల్లలకు కావలసినవన్నీ జానకమ్మ చూసుకునేది. ఉన్న ఆరెకరాల ఆస్తి అంతా పేకాటల్లో తగులబెడితే తన కొడుకు తన అనంతరం యీ మస్థి కుర్రాడిలా మారవచ్చు. ఈ ఆలోచన, కృష్ణుడి మాటలు, అతన్ని కలవరపెట్టాయి. సత్యనారాయణ భయంతో వణికిపోయాడు.

'లేదు! నువ్వు అలా లేవు కృష్ణా! అలా యెప్పటికీ వుండవు!' అంటూ ఉద్వేగంతో సత్యనారాయణ కృష్ణుడిని కౌగిలించుకున్నాడు. ఆ ఉద్రేకంతో అతని కంటినుంచి బాష్పాలు రాలాయి.

'ఆదేమిటి నాన్నా ఏడుస్తావెందుకూ!'

'ఏంలేదు అమ్మదగ్గరకు వెడదాంలే' అంటూ బట్టలు సర్దుకుని, కొడుకుని వెంటబెట్టుకుని, జట్కాలో గబగబా బస్సుస్టాండు దగ్గరికి

వెళ్ళాడు సత్యనారాయణ. కాని అప్పుడే ఆఖరిబస్సు వెళ్ళిపోయిందని తెలిసింది.

కాని సత్యనారాయణకు ఎలాగైనా ఆ రాత్రి యింటికి వెళ్ళిపోవాలనిపించింది. ఆఫీసుకు వెళ్ళి సైకిలు తీశాడు. కృష్ణుని ముందుకూర్చొ బెట్టుకుని, గబగబా కాలువగట్టున శరవేగంతో సైకిలు తొక్కడం మొదలు పెట్టాడు. కృష్ణుకు ఏవేవో అడుగుతూంటే, అతను ఊకొట్టడమే కాని, దృష్టి అంతా జానకమ్మ పైనేవుంది.

రాత్రి పదిగంటలకు యిద్దరూ యిల్లు చేరారు. వీధిలోంచి కృష్ణుడు సైకిలుగంట గణగణ గట్టిగా మోగించాడు. జానకమ్మ తలుపు తెరిచింది. రాత్రిళ్ళు సత్యనారాయణ వస్తే అలా గంట మ్రోగించడం అలవాటు. సత్యనారాయణ నవ్వుతూ యింట్లో అడుగుపెట్టాడు.

'అమ్మా! నాన్నను తీసుకువచ్చా చూశావా!' అంటూ తన ప్రతాపం వెలిబుచ్చాడు కృష్ణుడు. జానకమ్మ ఆనందంతో ఉప్పొంగిపోయింది. భర్తకు కాళ్ళు కడుక్కొందుకు, స్నానానికి నీళ్ళు యిచ్చింది. కొడుకూ తండ్రి అన్నానికి సిద్ధమయ్యారు.

'ఏమండీ! ఇంకా నామీద కోపం తగ్గలేదా!' అంది జానకమ్మ నవ్వుతూ.

'అమ్మా! నాన్నకూడా ఆ ఊళ్ళో ఏడ్చాడే! నాన్నకు యిప్పుడు కోపంలేదు' అన్నాడు కృష్ణుడు.

'ఏడిశావు వెధవ' అన్నాడు సత్యనారాయణ నవ్వుతూ.

'ఏం! ఉన్నరహస్యం చెప్పినందుకు వుడుకుమోత్తనమా!' చిలిపిగా నవ్వింది జానకమ్మ.

‘నీ రహస్యాలూ చెప్పాడులే నాకు’ పరిహాసించాడు సత్యనారాయణ.

‘అబ్బ! మీరు యిన్నాళ్ళు రాకపోతే రోజులు యుగాలుగా గడిచాయండి’ అంటూ జానకమ్మ ఒళ్ళు విరుచుకుని ఆవలించి, నవ్వింది.

తెల్లని చీర కట్టుకుని, చీరకు మించిన తెల్లని మల్లిపూలు తల్లో ముడిచి, మల్లిపూలకు మించిన తెల్లని నవ్వుల వెల్లులు జానకమ్మ పెదిమిలమీద కురిపించగానే “ఊహు” అంటూ సత్యనారాయణ ఆమె బుగ్గమీద చిటికె వేశాడు. కృష్ణుడు ఫక్కున నవ్వాడు.

‘ఏమిటిరా ఆ వెకిలినవ్వు’ అని కేక లేసింది జానకమ్మ.

“ఎందుకే వాడిమీద కోపపడతావు. వాడు నీ రాయబారి కదూ!’ అన్నాడు సత్యనారాయణ పరిహాసిస్తూ.